


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ చెరువులో వినాయక నిమజ్జనం

బైబై గణేశా..

గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు



గణపయ్యా మళ్లీ రావయ్యా



వికారాబాద్‌లో అన్నదానం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



నవాబుపేట: పులుమామిడిలో శోభాయాత్ర





వికారాబాద్‌లో గణేశ్ శోభాయాత్ర, డోలు వాయిస్తున్న యువతి

వికారాబాద్,
మేడ్చల్ జిల్లాల్లో ఘనంగా
వినాయక నిమజ్జనం
పోటాపోటీగా లడ్డూల వేలం
రూ 5.50 లక్షలు పలికిన
ఇందిరానగర్‌లోని గణపతి లడ్డూ

విఘ్నాలను తొలగించే గణనాథుడు వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో జయజయ ధ్వానాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. అశేష భక్తజనావళితో నవరాత్రులు విశేష పూజలందుకున్న లంబోదరుడు మళ్లొచ్చే ఏడాది వస్తానంటూ భక్తులకు వీడ్కోలు పలికాడు. కోలాటాలు, మంగళహారతులతో నిమజ్జనోత్సవానికి బయల్దేరిన గణనాథులను మహిళలు వాడ వాడలా ఎదురేగి సాగనంపారు. భారీ ఏర్పాట్ల మధ్య శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. వివిధ ఉత్సవ సమితులు, సంఘాలు, సేవాసంస్థలు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి గణనాథులకు స్వాగతం పలికి పూజాది కార్యక్రమాలు నిర్వహించాయి. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదే విధంగా గణనాథుడి చేతిలోని లడ్డూ ప్రసాదం కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 6



ఘట్‌కేసర్ రూరల్: చెరువు కట్టపై భక్తుల సందడి



వికారాబాద్‌లో నిమజ్జనం

పరిగిలో: తరలుతున్న గణనాథులు



పరిశీలిస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

పోటాపోటీగా లడ్డూల వేలం

వికారాబాద్ ఇంద్రానగర్‌లో వినాయకుడి లడ్డూను రూ..5.50 లక్షలకు ప్రవీణ్‌గౌడ్ దక్కించుకున్నారు. అలాగే ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి కాలనీలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ఒక లడ్డూను గుండా లక్ష్మణ్ రూ.2.51 లక్షలకు దక్కించుకోగా, రెండో లడ్డూను రూ.2.35 లక్షలకు గాజుల సంజీవరెడ్డి దక్కించుకున్నారు.





రసూల్‌పూర్ హనుమాన్ దేవాలయం

Sunday Special

ఆ ఊరికి హనుమంతుడే సాక్షి

కాలగర్భంలో కలిసిన గ్రామ శిలాసంపద



- పాడిపంటలతో విలసిల్లిన బేచిరాగ్
- శతాబ్దం క్రితం రాసులపురంగా కీర్తి
- రెవెన్యూ రికార్డుల్లో నేడు రసూల్‌పూర్‌గా గుర్తింపు

తాండూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శతాబ్దం క్రితం ఆ ఊరి పేరు బేచిరాగ్. అప్పుడు సంపన్న గ్రామంగా వెలుగొందింది. కాలక్రమేణా ఊరి పేరు కాలగర్భంలో కలిసిపోయింది. ప్రస్తుతం చరిత్ర మాసిపోకుండా గుర్తు చేయడానికన్నట్లు అన్నీ కనుమరుగైనా ఆంజనేయస్వామి ఆలయం సాక్ష్యంగా నిలిచింది. తాండూరు - కొడంగల్ రోడ్డుమార్గంలో తాండూరుకు మూడు కిలోమీటర్ల దూరంలో కాగ్నానది తీరాన ఉన్న బేచిరాగ్ ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో రసూల్‌పూర్‌గా కొనసాగుతోంది.

తాండూరు పట్టణానికి మూడున్నర కిలో మీటర్ల దూరంలోని కాగ్నానది తీరాన ఉన్న బేచిరాగ్ గ్రామం శతాబ్దం క్రితం పాడిపంటలు, ధాన్యపు రాశులతో విలసిల్లింది. రైతే రాజుగా వెలుగొందాడు. ఆ సమయంలో ఈ గ్రామాన్ని రాసులపురం అని పిలిచేవారట. ఇదే రానురాను రసూల్‌పూర్‌గా రెవెన్యూ రికార్డుల్లోకెక్కింది. ఈ ప్రాంతానికి ప్రాచీన చరిత్ర కూడా ఉంది. రసూల్‌పూర్ ఊరికి నలు దిక్కులా ఆలయాలైన నాగ సరశిలలు, లక్ష్మమ్మ, మైసమ్మ ఆలయాలు, శివాలయం, ఉగ్ర నృసింహస్వామి ఆలయాలు, మరెన్నో శిలా సంపదలు ఉండేవి. ఈ ఊరి శిలాసంపద ప్రకృతి వైపరీత్యాలతో కాలగర్భంలో కలిసిపోగా.. అక్కడక్కడా శిలలు, శిథిలమైన విగ్రహాలు

మిగతా 7వ పేజీలో...



జిల్లా పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను అతికిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

6,98,472

పరిషత్ ఓటర్లు

ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల

జిల్లా ప్రాదేశిక(జెడ్పీటీసీ), మండల ప్రాదేశిక (ఎంపీటీసీ) నియోజకవర్గాల వారీగా డ్రాఫ్ట్ ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాలు ప్రచురించారు. ఎన్నికల నిర్వహణకు డ్రాఫ్ట్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లా ఎన్నికల అధికారి ఆమోదంతో శనివారం ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా డ్రాఫ్ట్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలు ప్రచురించారు. జాబితాలో ఎంపీటీసీ స్థానాలు 227 ఉండగా పోలింగ్ కేంద్రాలు 1,288 ఉన్నాయి. మొత్తం ఓటర్లు 6,98,472 మంది ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు

మండలం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
బంట్వారం	6	30	40,990
బషీరాబాద్	12	82	32,121
బొంరాస్‌పేట్	11	60	40,977
ధారూరు	12	69	32,205
దోమ	14	75	40,828
దౌల్తాబాద్	14	71	46,646
కొడంగల్	11	53	38,710
కోట్‌పల్లి	7	43	17,589
కులకచర్ల	12	63	36,261
మర్పల్లి	15	94	44,185
మోమిన్‌పేట్	12	76	21,427
నవాబ్‌పేట్	12	69	38,387
పరిగి	11	56	45,581
పెద్దేముల్	13	77	39,576
పూడూరు	13	80	37,786
తాండూరు	15	78	31,139
వికారాబాద్	7	47	43,593
యాలాల్	13	80	24,237
చౌడాపూర్	9	43	25,156
దుద్యాల్	8	42	21,078
మొత్తం	227	1,288	6,98,472



వికారాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 2న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితాలు ప్రచురించింది. అయితే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల డ్రాఫ్ట్ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలు శనివారం

మిగతా 8వ పేజీలో...

జీపీవోలతో రెవెన్యూ బలోపేతం

ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామ పాలన అధికారుల నియామకంతో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని, సాధారణ ప్రజలు, రైతులకు సత్వర సేవలు అందుతాయని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్(ట్రెసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ అన్నారు. జీపీవోల నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో జీపీవోలు కీలక భూమిక పోషిస్తారని తెలిపారు. రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరించాలని పలుమార్లు ట్రెసా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియంలో చరిత్ర, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గీతాలక్ష్మీ పట్నాయక్ పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధన అనుభవం కలిగి సంబంధిత పీజీ సబ్జెక్టులో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 10వ తేదీ బుధవారం కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95059 74786లో సంప్రదించాలని కోరారు.

భర్త వెంటే భార్య

పెనిమిటి మరణాన్ని తట్టుకోలేక ఆగిన గుండె



ఇందిర, నారాయణరెడ్డి(ఫైల్)

కీసర రూరల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడు కాలం చేసిన గంటకే భార్య గెండె ఆగిపోయింది. నాగారం మున్సిపాలిటీ ప్రశాంత్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. జంబాపురం నారాయణరెడ్డి(70), ఇందిర(65) దంపతులు. పదేళ్లుగా ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి ఒక్కగానొక్క కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. శుక్రవారం నారాయణరెడ్డికి హఠాత్తుగా గుండెపోటు రావడంతో స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. భర్త మరణం తట్టుకోలేక రోదిస్తున్న భార్య ఇందిర స్పృహ తప్పి పడిపోయారు. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంటలోపే భార్యాభర్తలు మృతి చెందటం స్థానికంగా విషాదం నెలకొంది. అమెరికాలో ఉన్న కుమారుడు నేడు రానుండటంతో వారి అంత్యక్రియలు చేసేందుకు స్థానికులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా అనంత వ్రతాలు

వికారాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అనంత చతుర్ధశిని పురస్కరించుకొని అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో వైభవంగా అనంతపద్మనాభ వత్రాలు ఆచరించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా వ్రతాలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు దైవ దర్శనం చేసుకొని వత్రాల్లో పాల్గొన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి 250 జంటలు వృతాల్లో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎస్.పద్మనాభం, ఆలయ ఈవో నరేందర్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రోడ్ల పనులకు మోక్షం

పరిశీలించిన అధికారులు

తాండూరు, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): 'తాండూరులో బీటీ రోడ్లకు గ్రహణం' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ శ్రావణ్‌కుమార్ అర్థాంతరంగా నిలిచిపోయిన పనులను పరిశీలించారు. దీనిపై వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు హామీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిదని పేర్కొన్నారు. అలాగే తాండూరు - వికారాబాద్, తాండూరు - కోట్‌పల్లి, తాండూరు - మహబూబ్‌నగర్ రోడ్లను పరిశీలించారు. తాండూరు - కోట్‌పల్లి పనులను వెంటనే ప్రారంభిస్తామని ఈఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల కంపెనీ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రోడ్ల విషయాన్ని ప్రస్తావించారు. త్వరలో రోడ్ల పనులన్నీ పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. రోడ్ల కోసం రూ. 400 కోట్లపైన నిధులు రాబట్టినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాండూరు - కోట్‌పల్లి రోడ్డు

సీసీ కెమెరాలతో నేరాల అదుపు : సీఐ




సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేరరహిత సమాజ నిర్మాణానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని సీఐ గంగాధర్ అన్నారు. మండలంలో ని చరికొండలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులంతా ముందుకొచ్చి రూ.1.31లక్షలు జమ చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను శనివారం ఎస్ఐ వరప్రసాద్, స్థానిక నాయకు లు, యువకులతో కలిసి సీఐ ప్రారంభించారు. ఎన్నికల నేపథ్యంలో కడ్తాల మండలాన్ని నిఘా నీడలోకి తీసుకొచ్చేలా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించినట్లు సీఐ చెప్పారు. సందర్భంగా గ్రామస్తులను అభినందించారు. నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు వ్యవస్థలో సమూల మార్పులు

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదల శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవస్థల్లో సమూల మార్పులకు శ్రీకారంచుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. పాలనా సౌలభ్యం, మెరుగైన సేవలకు సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని చెప్పా రు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మం డలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎంఆర్ ఎఫ్ లబ్ధిదారులకు రూ.4లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. చేపడుతున్న పనులపై హైదరాబాద్‌లోని తన నివాసంలో అధికారులతో సమావేశమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆదేశించారు. గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి పాపమే నేడు సమస్యలకు కారణమవుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం వాటిని అధిగమించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ దారులకు డబ్బు సకాలంలో అందిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న అనేక బిల్లులను చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల్లో ఆనందం నిండుతోందని నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విపక్షాలు రాజకీయ కుట్రలు వీడి అభివృద్ధిలో కలసి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ పేరిట భూములు లాక్కుంటే పోరాటం



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు యాదయ్య, జగన్

ఆమనగల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు పేరిట ప్రభుత్వం రైతుల పొట్ట కొట్టొద్దని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పగడాల యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ అన్నారు. భూస్వాములు, పెట్టుబడిదారుల భూములు పోకుండా ట్రిపు ల్ ఆర్ అలైన్మెంట్ మార్చడం సరికాదని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం చెన్నంపల్లిలో శనివారం వారు పర్యటించారు. ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ నోటిఫికేషన్ నేపథ్యంలో భూములు కోల్పోయే రైతులతో వారు సమావేశమయ్యారు. తమ భూములు లాక్కోకుండా చూడాలని రైతులు వారిని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన అలైన్మెంట్‌తో ఆమనగల్లు మండలంలోని చెన్నంపల్లి, చింతలపల్లి, మేడిగడ్డ, సింగంపల్లి, నుచ్చుగుట్ట తండా, పోలేపల్లి గ్రామాల్లో 96శాతం భూములు పేదలవేనని వాపోయారు. పాత అలైన్మెంట్ మార్చి కొందరి మేలు కోసం కొత్త అలైన్‌మెంట్ రూపొందించి సన్న, చిన్నకారు రైతుల భూములు లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యాదయ్య, జగన్ ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని నిర్వాసితులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అలైన్మెంట్ మార్చే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు జగన్, శివశంకర్, మాజీ సర్పంచ్ శీనయ్య, రైతులు పరమేశ్, లక్ష్మయ్య, వెంకటయ్య, రామస్వామి, వెంకటేశ్, చంద్రయ్య, బలరామ్, జంగారెడ్డి, రాజు,రవీందర్, మల్లు, మల్లేశ్, చెన్నయ్య, సాయిలు, శ్రీను, మల్లేశ్ ఉన్నారు.

స్పీకర్ పదవి వదిలి రాజకీయాలు చేయాలి



మాట్లాడుతున్న ఆనంద్

వికారాబాద్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్ పదవికి రాజీనామా చేసి రాజకీయాలు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న ఎమ్మెల్యే సాధారణ రాజకీయ నాయకుడిలా వ్యవహరించకూడదన్నారు. అందుకే ఆయన స్పీకర్ పదవికి రాజీనామా చేసి సాధారణ ఎమ్మెల్యేవలె రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకుంటే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. శనివారం వికారాబాద్‌లో ఆనంద్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాపరంగా వికారాబాద్ జిల్లా అట్టడుగున్న ఉన్న సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ మాట్లాడిన విధానం సరికాదన్నారు. విద్యా పరంగా జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఉపాధ్యాయులకు చెప్పాల్సింది పోయి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని చెప్తున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలో చెప్పాలన్నారు. స్పీకర్‌గా కాంగ్రెస్ పార్టీ తరుపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడి ఉపాధ్యాయులను అవమానపర్చడమే కాకుండా, రాజ్యాంగ బద్ధ స్పీకర్ పదవికి మచ్చ తెస్తున్నారని ఆనంద్ పేర్కొన్నారు.

పదేళ్లలో రూ.4,600కోట్ల విలువైన పనులు



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో షాద్‌నగర్ నియోజకవర్గంలో రూ.4,600కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. ఈ పనులపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమా? అని ప్రశ్నించారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు ఎంఎస్.నటరాజన్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ గత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారే కానీ కొత్త ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి గురించి చెప్పడం లేదన్నారు. అభివృద్ధికి తామూ మద్దతునిస్తామని, అవాస్తవాలు మాత్రం మాట్లాడొద్దని అన్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నేతలు తమను చులకన చేసి మాట్లడడం భావ్యం కాదన్నారు. తాము ఏ రోజూ ఎమ్మెల్యేపై గానీ, కాంగ్రెస్ నాయకులపైగానీ అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు. మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని గెస్టహౌస్‌గా మార్చారని విమర్శించారు. తాము ఎన్నడూ క్యాంప్ కార్యాలయంలో రాజకీయ సమావేశాలను ఏర్పాటు చేయలేదన్నారు. ఫరూఖ్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులో నిలిచిన వాన నీరు



యాచారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఐదారు రోజుల క్రితం యాచారం, నందివనపర్తి, మేడిపల్లి, అయ్యవారిగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మేడిపల్లిలోని రైతుల పత్తి చేలల్లో నీరు నిలిచిపోయింది. పత్తిమొక్కలు కుళ్లిపోయే ప్రమాదముందని, ఇప్పటికే పూత రాలుతోందని వంశీకుమార్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పూతదశలో ఉన్న తన నాలుగెకరాల పత్తిలో పూత రాలుతుందని తెలిపాడు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న లింగ్యానాయక్, వాసుచంద్ర

పరిగి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను శనివారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో ఎం.వాసుచంద్ర పరిశీలించారు. ప్రాజెక్టు పరిసరాలను తిరిగి ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు. రాత్రిపూట నిమజ్జనం జరుగనున్న నేపథ్యంలో నిరంతరం లైటింగ్ ఉండాలని ఆదేశించారు. గణేశుల ఊరేగింపు మొదలుకొని నిమజ్జనం వరకు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వారితో తహసీల్దార్ వెంకటేశ్వరి ఉన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల చేతుల్లోనే రేపటి భవిష్యత్తు ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం బండవెల్కిచర్ల రవీంద్రభారతి పాఠశాలలో మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, పీఎస్ పీ ఎస్ అధ్యక్షుడు ఘనపూర్ రాఘవేందర్‌గౌడ్, కరస్పాండెంట్ వెంకట్రాములు, ఘనపూర్ రాంచంద్రయ్య, ప్రిన్సిపాల్ అబ్దుల్, వెంకట య్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షకయినా లడ్డూ పొందాలనుకున్నాడు...

లాటరీలో రూ.21కే సొంతం!



వినాయకుడి లడ్డూతో బొక్క నర్సింహారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏదేమైనా ఈసారి వినాయకుడి లడ్డూను దక్కించుకోవాలనుకున్న వ్యక్తి కోరిక చవకగానే నెరవేరింది. ఘట్‌కేసర్ పరిధిలోని బొక్కోనిగూడకు చెందిన బొక్క నర్సింహారెడ్డి ఇసారి వినాయకుడి లడ్డూను పొందాలనుకున్నాడు. సూర్యోదయ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం మూడు రోజుల క్రితం జరిగింది. లడ్డూ వేలంలో రూ.62వేల వరకు పాడాడు. పోటీ తీవ్రంగా ఉండటంతో వెనుకంజ వేశాడు. శుక్రవారం రాత్రి బొక్కోనిగూడలోని కట్టబస్తీలో పీటీవై యూత్ వినాయకుడి లడ్డూ వేలం వద్దకు చేరుకున్నాడు. ఇంతలో ఆయనకు ఫోనొచ్చింది. 'లాటరీలో మీకు లడ్డూ వచ్చింది. తీసుకుపోండి.' అని నిర్వాహకులు చెప్పారు. దీంతో నర్సింహారెడ్డి శివారెడ్డిగూడలోని శ్రీ దండ్లగడ్డ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ యూత్ ప్రతిష్ఠించిన వినాయకుడి వద్దకు చేరుకున్నాడు. అక్కడ లడ్డూ వేలం వేయకుండా రూ.21కి చొప్పున టోకెన్లను విక్రయించి వాటిని డ్రా తీసి వచ్చిన వారికి లడ్డూను అందజేస్తారు. ఇటీవల అన్నదానంలో పాల్గొన్న నర్సింహారెడ్డి రూ.105 పెట్టి ఐదు టికెట్లు కొన్నాడు. డ్రాలో లడ్డూను దక్కించుకున్నాడు. తాను లక్ష పెట్టి అయినా గణేశుడి లడ్డూను పొందాలనుకున్నానని, ఆ కోరికను చివరికి గణనాథుడే తీర్చాడని ఆనందం వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో నిర్వాకులు కొంతం అంజిరెడ్డి, కొంతం రాంరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



టోకెన్ల కోసం క్యూ కట్టిన రైతులు

మొయినాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల రైతులకు శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. మొత్తం 450బస్తాలు యూరియా వచ్చింది. మొయినాబాద్ రైతువేదికలో రైతులకు టోకన్లు ఇచ్చారు. సొసైటీ వద్ద యూరియా అందజేశారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం పరామర్శించారు. మృతులకు నివాళులర్పించారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పాము కాటుకు మందు అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. ఆయనతో నాయకులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జోగు వీరయ్య, లచ్చిరామ్ నాయక్, మనోహర్‌రెడ్డి, సూర్యప్రకాశ్ రావు, బాలయ్య, వరుణ్, శ్రీనివాస్, గోవర్ధన్, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జైపాల్ యాదవ్

ఉద్యమకారుడికి ఎమ్మెల్యే సన్మానం



వెంకట్‌రాంరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు సైతం ఆయనకు అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి నిరంతరం కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం,ఏ. కృష్ణారెడ్డి, కె.చెన్నయ్య, చంద్రశేఖర్, ముబారక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కులేదా?


ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కేశంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లంబాడాలకు లేదా? అని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ ప్రశ్నించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో శనివారం చేపట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటారన్న సమాచారంతో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేశారు. కేశంపేట ఎస్‌ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో పోడగుట్టతండాలో రాంబల్‌ను ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. రాంబల్ మాట్లాడుతూ.. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలిగించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అనుచరుడు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టులో కేసు వేశారని తెలిపారు. ఇదే అంశంపై మంత్రి పర్యటనను అడ్డుకుంటామని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. హక్కుల కోసం ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. మంత్రికి వినతిపత్రమిచ్చే వీలు లేకుండా హౌస్ అరెస్ట్ సరికాదన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా అరెస్ట్‌చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్బీఓఎల్ ఎండీకి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్బీఓఎల్ ఎండీ సరళరెడ్డి

తాండూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సుస్థిర వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన ఆర్బీఓఎల్ ఎండీ బుయ్యాని సరళాశ్రీనివాస్‌రెడ్డికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి హైదరాబాద్ ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ ప్రతిష్ఠాత్మక ప్రైవేటు సంస్థ నిర్వహించిన బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2020-25లను కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అందజేశారు. సరళరెడ్డికి అవార్డు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజారమణ తెలిపారు. అంకుశాపూర్‌లో శనివారం బతుకమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు, అల్లికలు, చేతివృత్తులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు చేతి వృత్తుల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ శారద, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పిట్టల మంగ, మంజుల, శ్రీశైలం, మంజుల, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో 65వేల గణనాథుల నిమజ్జనం

● కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పరిధి అన్ని ప్రాంతాల్లో వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతోందని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. శనివారం శంషాబాద్ పరిధిలోని కాముని చెరువులో నిమజ్జనోత్సవాన్ని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... సైబరాబాద్ పరిధిలోని కుంటలు, చెరువులు 40వరకు ఉన్నాని, వాటిల్లో శుక్రవారం వరకు 65 వేల గణేశులను నిమజ్జనం చేశారని చెప్పారు. శనివారం మరో 10వేల వినాయకులను నిమజ్జనం చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం వరకు నిమజ్జనాలు పూర్తవుతాయని చెప్పారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, ఇతర శాఖల సమన్వయంతో నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామన్నారు. సీపీ వెంట శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ, సీఐలు బాల్‌రాజ్, నరేందర్‌రెడ్డి, ఎస్సైలు ఉన్నారు.

శామీర్‌పేట: సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ బాలగంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, గురవయ్య ఉన్నారు.

యూరియా కొరత తీర్చాలి

కందుకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందజేయడంలో విఫలమైందని, యూరియా కోసం బారులు తీరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. శనివారం కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంపై రాష్ట్రం.. రాష్ట్ర తీరుపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం తప్ప రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే సరిపడా యూరియా అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

పూడూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పూడూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి శనివారం తనిఖీ చేశారు. కేంద్రం పని తీరును టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

ఆ ఊరికి హనుమంతుడే సాక్షి

(ఐదో పేజీ తరువాయి)


ఆలయంలో కొలువుదీరిన అభయాంజనేయస్వామి

పొలాల గట్టున దర్శనమిస్తాయి. పూర్వకాలంలో 200 మీటర్ల దూరాన నాలుగున్నర అడుగుల ఎత్తైన నంది విగ్రహం ఉండేదని, నాటి బేచిరాగ్ ఊరు ప్రాంతంలోనే రసూల్‌పూర్ పేరు మారినా ఈ ప్రాంతంలో వెలసిన అభయ ఆంజనేయ స్వామి దేవాలయం తాండూరు పట్టణానికి ఆగ్నేయ దిశగా ఉంది. గతంలో ఈ ప్రాంతవాసులు కీర్తి ప్రతిష్ఠలు, సుఖఃసంతోషాలతో జీవించేవారని నానుడి.

ఇసుకలో నుంచి విగ్రహాన్ని వెలికితీసి..

శతాబ్దం క్రితం కాగ్నానది ఒడిలో ఇసుక రేణువుల కింద తొమ్మిది అడుగుల లోతున కూరుకొనిపోయిన హనుమంతుడి విగ్రహాన్ని వెలికితీసి కొంత దూరంలో గుడి నిర్మించారు. తాండూరుకు చెందిన వాణిజ్యవేత్త గణేష్‌రామ్‌కు రసూల్‌పూర్ వద్ద ఆంజనేయస్వామి కలలో వచ్చి ఈ ప్రాంత విశిష్టతను చెప్పారట. విచిత్రమేమిటంటే స్వామి ఎదురుగా ఉన్న రావిచెట్టు మాత్రం ఆలయ నిర్మాణానికి ముందే అక్కడ మహావృక్షంగా ఎదిగి ఉండటం. రసూల్‌పూర్ ఆలయంలో నెలకొల్పిన మూల విరాట్ మహా శక్తిమంతమైనదిగా చెబుతారు. ఈ ఆలయంలోని ఆంజనేయ విగ్రహానికి ఎప్పుడూ సిందూరం పెట్టవొద్దని, మల్లెపూల నూనె పూసి చందన తిలకంతో కర్పూర హారతి ఇస్తుండడం విశేషం. ప్రస్తుతం ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. తాండూరు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వెళ్తుంటారు. ఐదేళ్లుగా ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తుల తాకిడి కూడా పెరిగింది.

ఆలయానికి స్థలం విరాళం

● ఆదర్శంగా నిలిచిన పోలె వీరమణి


గణనాథుడి సమక్షంలో డాక్యుమెంట్లు అందజేస్తున్న వీరమణి

వికారాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమె కున్న స్థలాన్ని మొత్తం ఆలయానికి రాసిచ్చి గొప్ప మనస్సును చాటుకున్నారో వృద్ధురాలు. వికారాబాద్‌లోని శివారెడ్డిపేటకు చెందిన పోలె వీరమణికి గ్రామంలో 400 గజాల స్థలం ఉంది. ఆమెకు ఒక కూతురు మాధవి ఉండగా కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. తనకంటూ వారసులు ఎవరూ లేకపోవడంతో వీరమణికి గొప్ప నిర్ణయం తీసుకుంది. తన తర్వాత ఈ స్థలం ఎవరికి పోతుందో అని ముందే ఆలోచించి తన కూతురి జ్ఞాపకార్థం ఆ భూమిని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం రాసిచ్చింది. ఇందుకు సంబంధించి డాక్యుమెంట్లను శనివారం గణనాథుడి సమక్షంలో గ్రామ పెద్దలకు అందజేసింది. ఆమె గొప్ప మనస్సుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపి సత్కరించారు.

ముదిరాజ్‌ల భవన నిర్మాణానికి ఎకరం కేటాయింపు


ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గ ముదిరాజ్‌లకు భవన నిర్మాణం కోసం ఎకరా స్థలాన్ని కేటాయిస్తూ శనివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. పరిగి మండలం రంగాపూర్ సమీపంలో ఎకరా స్థలాన్ని కేటాయించారు. అందుకు సంబంధించి ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే, మదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు టి.రామస్వామి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంఘ భవన నిర్మాణానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు టి.రామస్వామి, శ్రీశైలం, కులకచర్ల ఏఎంసీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కె.హన్మంత్‌ముదిరాజ్, శేరి బిచ్చన్న, కావలి సత్యనారాయణ, కె.రామకృష్ణ, చంద్రలింగం. సురేందర్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్-గుడూర్ రోడ్డు గోతులమయం

● ప్రయాణికుల నరకయాతన
● అరకొర నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా?


భారీ గుంతలమయంగా మారిన గుడూర్-తిమ్మాపూర్ రోడ్డు

కొత్తూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధి తిమ్మాపూర్-గుడూర్ రోడ్డు నరకప్రాయంగా మారింది. దీనిపై అడుగడుగునా గోతులేర్పడి, కంకర తేలడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలి వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతిని ప్రజలు దీనిపై రాకపోకలు సాగించలేకపోతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తూర్, నందిగామ, షాబాద్, శంషాబాద్ మండలాలను కలిపే ఈ రోడ్డుపై రాకపోకలు అధికంగా ఉంటాయి. రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ దూరం ప్రయాణానికి అధిక సమయం తీసుకుంటోంది. షాద్‌నగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు ఈ రోడ్డు కలుస్తుండడంతో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్‌లు బీటీ రోడ్డుకు 8కోట్ల రుపాయలను మంజూరు చేయించారు. శంషాబాద్ మండలం నానాజీపూర్, పిల్లోనిగూడను కలుపుతూ తిమ్మాపూర్ వరకు రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఈ 8కోట్లు మల్లాపూర్ శివారు వరకే సరిపోతాయని, తిమ్మాపూర్ మరో రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్నందున్న మరిన్ని నిధులు వెచ్చించి బీటీ రోడ్డు పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యేలు శంకర్, ప్రకాశ్‌గౌడ్‌లు పిల్లోనిగూడ వద్ద రోడ్డు పనులు ప్రారంభించారు. కానీ గుడూర్-తిమ్మాపూర్ రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి, సమస్యలను పరిష్కారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



గుడూర్-తిమ్మాపూర్ రోడ్డు గోతులమయంగా మారి, పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిండడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నాం. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలి.

- గుండు సురేశ్, గుడూర్

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అన్ని పార్టీల ఎంపీలు గుణపాఠం చెప్పాలన్నారు. అన్యాయంపై ఎవరు మాట్లాడినా వారిని అర్బన్ మావోయిస్టులుగా ముద్రవేసి జైళ్లలో పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ భవనంలో 'రాజ్యాంగ విలువల పరిరక్షణ' అనే అంశంపై మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి హరగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు ఉపరాష్ట్రపతిగా సుదర్శన్‌రెడ్డి సేవలు దేశానికి అవసరమన్నారు. కార్పొరేట్ శక్తులకు సంపదను దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని నిలువరించాలంటే రాజ్యాంగంపై అవగాహన ఉన్న సుదర్శన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. సుప్రీకోర్టు జడ్జిగా సుదర్శన్‌రెడ్డి మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడడం సరికాదన్నారు. సల్వాజుడూంను రద్దుచేస్తూ ఆయన తీర్పు ఇచ్చినంత మాత్రాన మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్టు కాదన్నారు. అమిత్‌షా గిరిజనులపై దాడులు చేయించి వారిని నిర్మూలించేలా కుట్రచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ వనమాల, ఫరూఖ్‌నగర్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు జంగయ్య, ఈశ్వర్ శ్రీనాయక్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు తమకు నచ్చిన రంగాల్లో రాణించాలి

● అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్


మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు తమకు నచ్చిన రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకుని రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సీ మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. స్పీకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సాధికారతకు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. వికారాబాద్‌లో 35మంది మహిళలకు 90 రోజులు కుట్టు మిషన్‌లో శిక్షణిచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబాల ఆర్థిక తోడ్పాడుకు దోహదపడతారన్నారు. మహిళలకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే బాధ్యతను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తీసుకోవాలని సూచించారు. మహిళలు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగుల కోసం మరిన్ని ఉచిత శిక్షణ కేంద్రాలను నిర్వహించేలా తమవంతు సహకారం అందిస్తానని స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, ఆర్డీఏ సభ్యుడు జాఫర్, స్ఫూర్తి గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌చార్జి ప్రసన్న పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం


చెక్కులు అందజేస్తున్న రవికాంత్‌గౌడ్

కడ్తాల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకూర్ల రవికాంత్‌గౌడ్ అన్నారు. ఎక్వాయిపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు. ఇటీవల మృతిచెందిన ఈర్లపల్లి రాజు, ఈర్లపల్లి బాలయ్య, జంగం పెంటయ్య, రాంచంద్రయ్య, కోమిటి, గఫార్, బుడ్డమ్మ, పెంటమ్మ, ఉస్మాన్ కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈర్లపల్లి రాజు కుటుంబానికి ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ పాలకూర్ల ఉమవతి, సుమన్, శంకర్, కరుణాకర్‌గౌడ్, యాదయ్య, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కోర్టులు దోహదం

● తెలంగాణ హైకోర్టు జడ్జి అభినందన్‌కుమార్


మహేశ్వరంలో కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి అభినందన్‌కుమార్

మహేశ్వరం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి పట్టణాలకే పరిమితమైన కోర్టులు ఇప్పుడు పల్లెప్రజల చెంతకు రావడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు అభినందన్‌కుమార్, విజయసేన్‌రెడ్డి అన్నారు. మహేశ్వరంలో శనివారం సీనియర్ సివిల్ జడ్జి కోర్టును వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఒకప్పుడు పట్టణాలు, నగరాలకే పరిమితమైన కోర్టులు ఇప్పుడు గ్రామాల్లోనూ ఏర్పాటవుతుండటం హర్షించతగ్గ విషయమన్నారు. సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా మహేశ్వరంలో సీనియర్ సివిల్ కోర్టును ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. మహేశ్వరం కోర్టు పరిధిలోని ప్రాంత ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కోర్టుల జడ్జిలు కరుణకుమార్, ప్రదీప్‌నాయక్, రమాకాంత్, సత్యేంద్ర, శ్రీదేవి, మైత్రేయి, అపర్ణమల్లాది, యశ్వంత్‌సింగ్, హిమబిందు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ చైర్మన్ హరికిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తాం


సభ్యత్వ నమోదు అందజేసిన పీడీఎస్‌యూ నాయకుడు శ్రీనివాస్

తాండూరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యా సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం తాండూరులోని శాలివాహన డిగ్రీ కళాశాల, అంబేద్కర్ పారా మెడికల్ కళాశాలల్లో పీడీఎస్‌యూ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల సంక్షేమం, హక్కులు, ఫీజులు, రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యపై పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకునేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

తాండూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం 119 మందికి రూ.40లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్, 96 మందికి రూ.96లక్షల విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసే వారికి కాలమే సమాధానం చెబుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, సీనియర్ నాయకులు ఉత్తమ్ చందు, సర్దార్ ఖాన్, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

అలక వీడిన మాజీ చైర్‌పర్సన్

కాగా కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలకు, అధికార కార్యక్రమాలకు దూరంగా ఉండి సైలెంట్ రాజకీయాలు చేసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న శనివారం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. ఇటీవల ప్రధాన మంత్రి మోదీని పొగిడిన ఆమె పార్టీ వీడతారనే పుకార్చొచ్చాయి. వాటిని ఆమె ఖండించలేదు. గాంధీ చౌక్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, స్వప్న పలకరించుకున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే కోరడంతో ఆమె అంగీకరించి క్యాంప్ కార్యాలయానికి వచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


కొత్త మోటారు బిగిస్తున్న సిబ్బంది

కులకచర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో తిరుమలాపూర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి గ్రామంలో బోరు వేయించారు. శనివారం బోరుకు మోటార్‌ను బిగించి నీటి సరఫరా చేశారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కార్యాలయంలో ఎవరైనా డబ్బులడిగితే నా దృష్టికి తెండి

● తాండూరు తహసీల్దార్ తారాసింగ్


ప్రసంగిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులకు సంబంధించి తమ కార్యాలయంలో కొందరు సిబ్బంది లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయని, ఎవరైనా ప్రజలను డబ్బులు అడిగితే వెంటనే తన దృష్టికి తేవాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో ఆయననీ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఏ పనికీ, ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంటే ప్రజా సేవకులని, అందుకు తమకు ప్రభుత్వం జీతాలిస్తుందని చెప్పారు. తాను బీద కుటుంబం నుంచి వచ్చానని, పేదల కష్టాలు తెలుసన్నారు. ఇటీవల ఆర్ఐ గోపి రేషన్‌కార్డుల పంపిణీలో డబ్బు తీసుకున్నారని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణాధికారిగా తారాసింగ్‌నే నియమించారు.ఆర్ఐ సెలవుపై వెళ్లారు. విచారణకు వేరొకరిని నియమించాలని కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం.

మట్టి రోడ్డులో దిగబడిన లారీ


రోడ్డు పక్క దిగబడిన బొగ్గులోడ్ ఉన్న లారీ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఎన్‌హెచ్ 167-ఎన్ పనుల్లో భాగంగా కొడంగల్ మండలంలోని పర్సాపూర్ గ్రామం దగ్గర రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని చించోలి వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డులో శనివారం బొగ్గు లోడ్‌తో చెన్నై నుంచి పుణేకు బయల్దేరిన లారీ పర్సాపూర్ వద్ద మట్టిలో కూరుకుపోయింది. దీంతో లారీని ఓనర్ పెద్ద క్రేన్‌తో బయటకు తీయించాల్సివచ్చింది.


బషీరాబాద్: మైల్వార్‌లో గణేశుని దర్శించుకున్న అనంతరం యూత్ సభ్యులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


దోమ: బాసుపల్లిలో వినాయక నిమజ్జనంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


వికారాబాద్: పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


వికారాబాద్: వినాయక నిమజ్జనం వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


వికారాబాద్: గణనాథుడి నిమజ్జనోత్సవంలో భక్తుల సందడి

వెళ్లిరా.. గణేశా

11 రోజులు పూజలందుకున్న గణనాథుడిని శనివారం డప్పు వాయిద్యాలు, నృత్యాల మధ్య గంగమ్మ ఒడికి చేర్చారు. వెళ్లిరా.. గణేశా.. అంటూ స్మరించుకుని గణపయ్యకు వీడ్కోలు పలికారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించి వినాయక నిమజ్జనం చేశారు. వినాయక మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో భక్తులు పోటీపడ్డారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


కీసర రూరల్: నాగారంలోని రాంపల్లిలో వినాయకుడి లడ్డూను రూ.2.11లక్షలకు కైవసం చేసుకున్న ప్రసాద్‌గౌడ్


కొడంగల్: లాహోటీ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వికారాబాద్: నిమజ్జనానికి బయల్దేరిన ఇంద్రానగర్ గణనాథుడు


ఘట్‌కేసర్: సింగరేణి కాలనీలో జరిగిన వినాయకుడి లడ్డూను వేలంలో రూ.2.51లక్షలకు దక్కించుకున్న గుండా లక్ష్మణ్ కుటుంబం


ఘట్‌కేసర్: సింగరేణికాలనీలో వినాయకుడి లడ్డూను వేలంలో రూ.2.35లక్షలకు దక్కించుకున్న గాజుల సంజీవరెడ్డి కుటుంబం


పరిగి: బ్రాహ్మణవాడ శివాలయం గణేశుడి ఊరేగింపు


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారంలో మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి పూజలు


ఘట్‌కేసర్: బొక్కోనిగూడలో రూ.63,500లకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్న చందుపట్ల హరికాంత్‌రెడ్డి


వికారాబాద్: రామయ్యగూడ స్నేహ యువజన సంఘం వినాయకుడి లడ్డూను రూ.91వేలకు దక్కించుకున్న సంతోష్‌కుమార్ బృందం


పరిగి: అయ్యప్పగుడిలో గణేశుడి లడ్డూను రూ.3.71లక్షలకు దక్కించుకున్న గిరిజన నేత, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్


యాలాల: సంగెంఖుర్దులో వినాయకుడి లడ్డూను రూ.60వేలకు దక్కించుకున్న మోహన్


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ చెరువులో క్రేన్‌తో వినాయక నిమజ్జనం


బొంరాస్‌పేట్: లక్కీ డ్రాలో నీరటి కృష్ణకు ద్విచక్రవాహనం తాళంచెవిని అందజేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు



వికారాబాద్: గణనాథులకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ మైనార్టీ విభాగం సభ్యులు


ఘట్‌కేసర్ రూరల్: నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రజిని, కమిషనర్ రాజేష్, సీఐ బాలస్వామి

6,98,472

(ఐదో పేజీ తరువాయి)

జెడ్పీ కార్యాలయంలో అదనపు జిల్లా ఎన్నికల అధికారి జి.సుధీర్ ప్రచురించారు. కాగా, ప్రజలకు సమాచారం కోసం కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం, సబ్ కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు ప్రచురించారు. ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీడీవోలు తమ పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ నియోజకవర్గాల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదాలను ప్రచురించారు.

కొనసాగుతున్న ప్రక్రియ

ఏమైనా అభ్యంతరాలు ఉంటే 6 నుంచి 8వ తేదీ వరకు సంబంధిత అధికారులు స్వీకరించనున్నారు. 8న జిల్లా స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. అదే రోజు మండల స్థాయిలో ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. వచ్చిన అభ్యంతరాలను 9వ తేదీన పరిష్కరిస్తారు. 10న జిల్లా ఎన్నికల అధికారులు ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితాలు ప్రచురించనున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ రేపు(సోమవారం) మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు అందరి పింఛన్లను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. కానీ 20నెలలు గడుస్తున్నప్పటికీ పింఛన్లను పెంచలేదని ఆరోపించారు.

ఓటరు ముసాయిదా జాబితా విడుదల

దుద్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండల ఓటరు ముసాయిదా జాబితాను శనివారం ఎంపీడీవో మమేశ్‌కుమార్ విడుదల చేశారు. మండల కేంద్రంలో శనివారం ఒక జడ్పీటీసీ, ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మండలంలో మొత్తం 21,078మంది ఓటర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీవో సత్యనారాయణ, కృష్ణ, ఖాజా పాల్గొన్నారు.

కులకచర్ల: కలెక్టర్ ఆదేశాలతో మండల ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాను విడుదల చేశారు.

అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

యాలాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉడిమేశ్వరంలో రూ.30లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్, ఏఈ రవి కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, హన్మిరెడ్డి, కుమ్మరి మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జనార్ధన్, కానగడ్డ శ్రీనివాస్, లక్ష్మప్ప, మాసప్ప, ఈడ్గి అంజిలప్ప, గండి మహేష్, సయ్యద్ బాష, సాయిలు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో గల ఎల్లమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


తాండూరు రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శరణుబసప్ప

తాండూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.శరణు బసప్ప ఆధ్వర్యంలో శనివారం జినుగుర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగప్ప, ఉపాధ్యాయులను క్లబ్ అధ్యక్షుడు శరణుబసప్ప శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ బి.గౌరి శంకర్, జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ నల్లా దామోదర్, జిల్లా చైర్మన్ పి.బస్వరాజ్, యద్రామి బసనప్ప, సభ్యులు జయంత్, ఉపాధ్యాయులు జయశ్రీ, స్వప్నకుమారి, భాగ్యశ్రీ, భానుప్రకాష్, నర్సింహులు, ఏపీపీసీ చైర్మన్ తుల్జమ్మ పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే తాండూరు పట్టణం బాలాజీ మందిరంలో రిటైర్డు ఉపాధ్యాయులు షేరి సుధాకర్‌రెడ్డి, మృత్యుంజయ స్వామి, మాధురి, మొగులయ్య, పాండప్ప, సరితలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓం ప్రకాష్ సోమాని, మన్మోహన్ సార్డా, మురళీధర్ గగ్రాని, తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లి పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.


తాండూరు: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మార్వాడీ యువమంచ్ ప్రతినిధులు

అధ్యాపకులకు సత్కారం

తాండూరు: తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఉత్తమ్ చంద్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులను, ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో తేల్చుకోండి.. ఇక్కడికి రావొద్దు

- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసుల సమాధానం
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అడ్డుకునేందుకు వెళ్తే దాడులు

వికారాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి స్థలంలో ఇతరులు నిర్మాణం చేపట్టడంతో ఇదేంటని అడిగితే దాడులకు పాల్పడుతున్నారు. స్థానిక పోలీసుల వద్దకు వెళితే పట్టించుకోవడంలేదు. దీంతో ఎస్పీ కార్యాలయానికి వెళితే ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, ఇక్కడికి రావొద్దని ఉచిత సలహాలు ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమపై దాడి చేసిన వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. కష్టపడి కొనుగోలు చేసిన ప్లాట్లులో అక్రమార్కులు ఇల్లు కడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని బాధితులు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం దీర్సంపల్లికి చెందిన కూర శ్రీశైలం గ్రామంలోని 15, 16వ సర్వే నంబర్‌లో లేఅవుట్‌లో 135గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ స్థలంలో కొందరు అక్రమార్కులు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా మూడు సార్లు నోటీసులు ఇచ్చినా అక్రమార్కులు నిర్మాణాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన కూర శ్రీశైలంతో పాటు ఆయన భార్య సంధ్యారాణిపై దాడికి దిగారు. దీంతో వారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లుగా తెలిపారు. అక్కడా న్యాయం జరుగక పోవడంతో సెప్టెంబరు 4వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి శనివారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వస్తే అక్కడి పోలీసులు సైతం పట్టనట్లు వ్యవహరించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

అక్రమ తవ్వకాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

తాండూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్, ఓగీపూర్, మల్కాపూర్ గ్రామాల్లో పట్టా భూముల యజమానులు పక్కన భూమివారు కొందరు అక్రమంగా తవ్వకాలు చేపట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని మైన్స్ ఏడీతోపాటు కలెక్టర్, మైన్స్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు శనివారం లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఫిర్యాదుకు పూర్తి వివరాలతో వారు ఇచ్చిన తేదీ రోజు నివేదికలు అందించాలని మైన్స్ ఏడీ సత్యనారాయణ, తాండూరు తహసీల్దార్‌తో చర్చలు జరిపారు. ఈనెల 11న లోకాయుక్తకు నివేదికలు అందించాలని, జాయింట్ సర్వే చేయాలని పేర్కొన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదుదారులు వెంకట్‌రాంరెడ్డి, ఫసియొద్దీన్ మైన్స్ ఏడీ వద్ద లోకాయుక్తపై సమాచారం అడిగారు. ఫసియొద్దీన్ ఓగీపూర్‌లోని సర్వేనెంబర్-58/5లో సర్వే చేసి తమ భూములు చూపించాలని రెవెన్యూ సర్వేయర్‌ను కోరడంతో అప్పట్లో డివిజన్ కాలేదు కాబట్టి ఎవరి భూమి అని చూపించలేకపోతున్నామని అన్నారు. పక్కన భూమిలో ఉన్న వ్యక్తులు సర్వేనెంబర్-58లో అక్రమ లీజులు అయిపోయినా తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసింది.


లోకాయుక్తపై సమాచారం అడిగి తెలుసుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి, ఫసియొద్దీన్

రోడ్డును తొలగించొద్దు

దుద్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లగచర్ల సమీపంలోని పొలాల దగ్గర ఉన్న సాగు బసవ్వ నగర్ కాలనీ రోడ్డును తొలగించొద్దని కాలనీవాసులు అడ్వకేట్ శివకుమార్ శనివారం తహసీల్దార్ కిషన్‌నాయక్‌ను కోరారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా హకీంపేట్ నుంచి సాగు బసప్ప నగర్ కాలనీ మీదుగా లగచర్ల గ్రామానికి వెళ్లే ఈ రోడ్డును తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు పూర్వకాలం నుంచి ఉందని, నక్షాలో కూడా ఉందన్నారు. రోడ్డును తొలగిస్తే కాలనీవాసులకు ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు.


జేసీబీతో రోడ్డుకు అడ్డంగా తవ్వకాలు

సంక్షిప్తంగా..

కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత

పరిగి: పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత దస్తగిరిపటేల్(65) అనారోగ్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. ఆయన మృతిపట్ల పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

దోమ: మండలంలోని కొండాయిపల్లిలో ఈనెల 23న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రావాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని గ్రామస్థులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్, రమేశ్, పాల్గొన్నారు.

విద్యార్థుల స్వయంపాలన

పరిగి: మహాత్మ జ్యోతిబాఫూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠశాలను నడిపించి అబ్బురపరిచారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో గోపాల్ పాల్గొని అభినందించారు. ప్రిన్సిపాల్ జి.సౌజన్య, ఉపాధ్యాయులు జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మరమ్మతులు చేసినా లీకేజీ

దుద్యాల: మహబూబ్‌నగర్-చించోలి జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండలంలోని హస్నాబాద్ మీదుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. తిరిగి పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

బషీరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎక్మాయి గ్రామానికి చెందిన కమ్మరి గౌరిశంకర్, రాజుకుమార్‌లకు రూ.98వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు.

దుద్యాల: సత్తర్‌కుంట తండాకు చెందిన దేవ నాయక్‌కు కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్ రూ.50వేల చెక్కును శనివారం అందజేశారు.

తాండూరు-గానుగాపూర్ బస్సు ప్రారంభం

తాండూరు, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఆర్టీసీ డిపో నుంచి గానుగాపూర్ దైవక్షేత్రానికి బస్సును శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకపూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో ఎక్కి మొదటి టికెట్‌ను తీసుకోని కొద్దిదూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డిపో మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలన్నీ అబద్ధాలు


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

యాలాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట రైతు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలన్నీ పచ్చి అబద్ధాలని యాలాల మండల బీజేపీ అధ్యక్షుడు ఆకుల శివకుమార్ అన్నారు. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినందుకు శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోది చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గోవిందరావుపేట్ రైతు పొలాల్లో రూ.25లక్షలతో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కొంతమంది కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పేర్కొన్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రమ్య నాయక్, నారాయణరెడ్డి, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడంతో క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, నాయకులు రత్నం, నర్సిములు పాల్గొన్నారు.

నేడు పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ 33వ నెల గిరి ప్రదక్షిణను ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ షైపాల్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆలయంలో 5 గంటలకు రుద్రహోమం, అనంతరం 7 గంటలకు గిరి ప్రదక్షిణ కొనసాగుతుందని తెలిపారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు సాయంత్రం నిర్వహించే గిరి ప్రదక్షిణ చంద్రగ్రహణం ఉండటంతో ఉదయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉప సర్పంచ్

చౌడాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడవి వెంకటాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ నేనావత్ లింగ్యానాయక్ శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాంనాయక్, నాగరాజు పాల్గొన్నారు.

9 నుంచి కాప్రా, కీసర జోనల్ గేమ్స్

కీసర రూరల్. సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి కాప్రా, కీసర జోనల్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 69వ జోనల్ ఫెడరేషన్ గేమ్స్ నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి మనోహర్ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 9న అండర్ 17, 14 బాలురుకు ఖోఖో, బాలికలకు కబడ్డీ, 10న అండర్ 17, 14 బాలురుకు వాలీబాల్, కబడ్డీ, బాలికలకు ఖోఖో, 11న విగతా పోటీలను నిర్వహించటంతో పాటు, బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.